

# అమెరి'కా'లేజ్

## – లిపి మల్లాది



*అమెరికాలో కాలేజీ చదువంటే ఒకప్పుడు గగనకుసుమం, అదో ఇంద్రజాలం. గత రెండు, మూడు దశాబ్దాల్లో అమెరికాలో చదువుకోసం వస్తున్న విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరగడమే కాక, ఇండియాలో కూడా ఒక మాదిరిగా చదువుకున్న కుటుంబాల్లో దాదాపు ప్రతి ఇంటికీ కనీసం ఒకరైనా అమెరికాలో చదువుకుంటున్న పిల్లలుంటున్నారు. ఇంటర్నెట్ అరచేతిలోకొచ్చేసిన ఈ రోజుల్లో అమెరికాలో కాలేజీలు ఎలా ఉంటాయో, అక్కడ డార్మ్స్ ఎలా ఉంటాయి, స్టూడెంట్స్ జీవితాలు ఎలా ఉంటాయో... అనే విశేషాలు అతి సులువుగా తెలిసిపోతున్నట్లనిపిస్తున్నాయి. ఐనా మొదటిసారి చదువుకోసం అమెరికా వచ్చే ప్రతి విద్యార్థికీ ఎవరి అనుభవం వారిదే, ఎవరి ఇబ్బందులు వారివే, ఎవరి స్నేహాలు వారివే. ఈ నేపథ్యంలో అమెరికాలో చదువుకోసం వచ్చిన ఓ సాధారణ మధ్యతరగతి అమ్మాయికి ఎదురైన సంఘటనలు, సన్నివేశాలు.. స్నేహాలు, సంతోషాలు.. సరదాలు.. వెరసి ఇవన్నీ అమెరికాలేజీ కథలు. స్వానుభవాలనూ, విన్న అనుభవాలనూ, చూసిన అనుభవాలనూ – ఆసక్తికరమైన ధారావాహికగా కౌముది పాఠకులకు అందిస్తున్నది లిపి మల్లాది. 'నా కళ్ళతో నాన్న' ధారావాహికతో కౌముది పాఠకుల అభిమానాన్ని సొంతం చేసుకున్న లిపి మల్లాది ఈ ధారావాహికతో మీకు మరింత చేరువౌతుందని ఆశిస్తూ..*

*– సంపాదకుడు*

### (కిందటి సంచికనుండి కొనసాగింపు)

**చూస్తూ చూస్తూ మిడ్‌టర్మ్** ఎగ్జామ్స్ దగ్గర పడ్డాయి. ప్రతిసారిలాగే కేంపస్ జనాలతో కిటకిటలాడింది. లైబ్రరీలో రూం రిజర్వ్ చేసుకుంటేకానీ కూర్చునేందుకు చోటులేదు. నేను, హనీష మా లాబ్‌లో చదువుకోవడం ప్రారంభించాము. ఎప్పుడూ సినిమాలు, పాటలు, ఆకాయ్, పోకాయ్ కబుర్లు చెప్పే హనీష చదవడం ఇదే నేను మొదటిసారి చూసింది. రెయిన్‌కి నేను హనీషని పరిచయం చేసినప్పుడు కూడా కట్టే కొట్టే తెచ్చేలా మాట్లాడింది కానీ ఎప్పటిలా ఎక్కువ మాట్లాడలేదు. మొదటిసారి కలిసిన వ్యక్తితో కూడా ఎన్నో ఏళ్ళ పరిచయం ఉన్నట్టు కలుపుకోవడం తన టాలెంట్. వెంటనే వెన్నెలకి మెసేజ్ పంపి ఈ సంగతి చెప్పాను. "మిడ్ టరమ్స్ లో మంచి మార్కులొస్తే కొత్త ఫోన్ కొనిస్తారట. అందుకని కష్టపడుతుంది పాపం" వెన్నెల బదులిచ్చింది.

అదేంటి? ఇక్కడ ఫోన్ ఇన్‌స్టాల్మెంట్‌లో తీసుకోవచ్చు కదా? నాకెందుకులే అని నాపని నేను చేసుకోసాగాను. లంచ్‌కి ఎప్పటిలా ఇంటికి కాక కెఫెటేరియాకి వెళ్ళాము. నడుస్తుండగా, "ఇంట్లో అయితే వండాలి, తినాలి, మళ్ళీ తోమాలి. అదే కెఫెటేరియాలో అయితే కనక ఆ టైం అంతా తినొచ్చు" అంది .హనీష ఎప్పుడూ ఇంత శ్రద్ధగా చదివితే ఐ ఏ ఎస్సో, ఐపిఎస్సో అయ్యేది. నిజానికి తను రోజూ అలా కిందా మీదా పడి చదవగలదని నేను అనుకోలేదు. నేను కొన్నిసార్లు నా క్లాసుమేట్‌తో కలిసి చదువుకుని తిరిగి వచ్చేదాకా కూర్చున్నచోటునుండి కదిలేది కూడా కాదు. కొన్ని రోజులకి నేను ఆగలేక, కేఫటేరియాకి వెళుతుండగా "నువ్వు ఎంసెట్ కూడా ఇలానే చదివావా?" అని అడిగాను. ఆశ్చర్యంగా నా ముఖం చూసి "ఎంసెట్ ఏంటి? నేను ఐఐటి" అంది.

"అదేంటి? నువ్వు ఐఐటిలో చదివావా?" ఆశ్చర్యపోయాను. అనవసరంగా తను బాగా చదవని అమ్మాయని పొరపాటు పడ్డా అని బాధపడేలోగా తను పెద్దగా నవ్వి "లేదు. అంత సీన్ నాకు లేదు. నేను మేనేజ్‌మెంట్ కోటాలో సీట్ కొన్నాను" అంది.

నేను కూడా మనసు కుదుటపడడంతో నవ్వాను. భోంచేస్తున్నంతసేపు "రామ్ ఈ కాలేజీలో చదివాడు, అభిషేక్ ఆ కాలేజీ, రమ్య సీట్ కొంది కానీ బిల్డప్ ఇస్తుంది, పూజకి చాలా బాక్ లాగ్స్, మౌనిక ఎంసెట్ రిపీట్" అంటూ ఎప్పటిలానే కబుర్లు చెప్పింది.

ఎగ్జామ్స్ అవ్వగానే లైబ్రరీ ఖాళీ అయ్యింది. నేను నా థీసిస్ కోసం లైబ్రరీలో ప్రశాంతంగా టెక్స్ట్ బుక్స్ చదవసాగాను. తిప్పికొడితే ఇద్దరు ముగ్గురు మాత్రమే ఉండడంతో హాయిగా, ప్రశాంతంగా ఉంది. ఇంతలో విజయ్, హనీష బుక్స్ రిటన్ చేసేందుకు వచ్చారు.

"నువ్వేం చేస్తున్నావు ఇక్కడ?" అడిగారు.

"థీసిస్‌కి చదువుతున్నా."

"నిన్నేగా ఎగ్జామ్స్ అయ్యాయి?"

"అయినా పని చాలా ఉంది."

"కనీసం రెండూ రోజులు కూడా బ్రేక్ తీసుకోవా?" విజయ్ అడిగాడు.

"లేదు. ఆల్రెడీ ఎగ్జామ్స్ కి రెండు వారాల ముందునుండి ఏం పని చెయ్యలేదు."

"మీ ప్రొఫెసర్ ఏమనరా?"

"లేదు .ఎగ్జామ్స్ కి కాన్సన్‌ట్రేట్ చెయ్యమని మీటింగ్స్ కాన్సిల్ చేస్తారు ప్రతిసారి."

"బానే మంచాయన దొరికాడు నీకు. సరే కానీ, మేం సినిమాకి వెళుతున్నాము వస్తావా?"

"లేదు. చదువుకోవాలి" అన్నాను.

"కారులో ప్లేసు ఉందా?" హనీష విజయ్‌ని అడిగింది.

"కార్తీక డ్రాప్ అట" విజయ్ బదులిచ్చాడు.

"అయితే రా నువ్వు కూడా. రేపు చదువుకో" అంటూ హనీష్ మరీ ఇబ్బంది పెట్టటంతో తప్పక వెళ్ళాను. తెలుగు సినిమా థియేటర్‌లో చూసి ఎంతో కాలం అయిందని గుర్తుకొచ్చింది. ఈ సినిమా అన్నీ సినిమాల్లా హీరో ఎంట్రీ ఫైట్, తరవాత హీరోయిన్ ఎంట్రీ సాంగ్ లా కాకుండా మామూలుగా ఉండడం నాకు ఎంతో నచ్చింది. ఇందులో జోకులు కూడా నిజంగా నవ్వొచ్చేలా ఉండడంతో చదువుకి డుమ్మా కొట్టినందుకు బాధగా అనిపించలేదు. ఇంటర్‌వెల్లో నేను, హనీష పాప్‌కార్న్ షేర్ చేసుకుంటే, హిమజ, విజయ్ ప్రెట్జెల్ తీసుకున్నారు. సినిమా థియేటర్‌లో ప్రెట్జెల్ తినడం ఇదే నేను మొదటిసారి చూసాను. "ఇండియాలో సాండ్‌విచ్ తింటారుగా, ఇదీ అంతే" అంది హిమజ.

నేను ఒప్పుకోకపోవడంతో "సాండ్ విచ్ కాకపోతే సమోసా. అదెందుకు ఇప్పుడు? సినిమా ఎలా ఉంది?" విజయ్ అడిగాడు. మేం ముగ్గురం బావుంది అనడంతో కాస్త నిరాశపడ్డాడు.

"ఏం బావుంది? ఒక్క ఫైట్ కూడా లేదు" అన్నాడు.

"అందుకే బావుంది" అన్నాను.

"హీరో అంటే అసలెట్లుండాలి? విలన్స్‌ని కొడుతూ, గన్ పేలుస్తు. అంతేకానీ ఇలా పప్పులా వుంటే హీరో అని ఎలా అంటారు?" అన్నాడు.

"నువ్వే పెద్ద హీరో అని ఫీల్ అయిపోతుంటావుగా, ఎంతమంది విలన్లని కొట్టావేంటి?" హనీష అడిగింది. ఇంతలో సినిమా మొదలవడంతో అంతా నిశ్శబ్దంగా కూర్చున్నాము. సినిమా పూర్తయ్యాక "బానే ఉందిలే. వన్ టైం వాచ్" అన్నాడు. ఇంటికి వెళ్ళేంతసేపు ఆ సినిమాలో పాటలు వింటూ, పాడుకుంటూ వెళ్ళాము. ముందు నన్ను దింపి ఆ తరవాత వాళ్ళు వెళ్ళారు. ఇవాళ ఎంతో ఆహ్లాదకరంగా సాగింది. నిజంగానే అంత చదివాక ఒకరోజు కేవలం నవ్వుకోవడానికి ఎంతో అవసరం. ఇలా సరదాగా ఫ్రెండ్స్‌తో పైసా లాభంలేని పనులు చెయ్యడం కూడా ముఖ్యమేనని అర్థమైంది. నేహ లేకపోవడంతో ఇంటికి వెళ్ళిన కొన్ని నిమిషాలకే నిద్రపోయాను.

నేను లేచేసరికి నా ఫోన్‌లో ఐదు మిస్డ్ కాల్స్, నలభై మూడు మెసేజెస్. ఏమైందా అని గబగబా తెరిచి చూసాను. ఏదో వాట్స్అప్ గ్రూపులో నన్ను ఆడ్ చేసారు. అందులో హనీష ఉండడం చూసి తనకి కాల్ చేసాను.

"ఆ గ్రూప్ ఏంటి?" అడిగాను.

"ఇండియా – పాకిస్తాన్ క్రికెట్ గురించి. "

"ఓ అంతేనా? నేనిమేమైందో అని భయపడ్డాను."

"భయం దేనికి?"

"నేను లేచేసరికి ఫార్టీత్రీ మెసేజెస్ ఉన్నాయి."

చిన్నగా నవ్వి "వాళ్ళే ఏదో గౌతం గంభీర్, ధోనీలా ఫీల్ అవుతూ మెసేజ్ చేస్తుంటారు. నేనే నిన్ను ఆడ్ చేసా. ఎల్లుండి ఉందిట గేమ్" అంది.

"నేను చూడను. నాకు క్రికెట్ పెద్దగా ఇష్టంలేదు" అన్నాను.

"నాకూ పెద్దగా ఇష్టం ఉండదు కానీ వాళ్ళతో కలిసి చూస్తే ఫన్‌గా ఉంటుంది" అంది.

నిన్న బాగానే గడిచినందుకు 'సరే' అని చెప్పాను.

గేమ్ రోజున కేఫెటేరియాలోని టీవీలో గేమ్ ని పెట్టి అంతా అక్కడ కూర్చున్నారు. నేను, హనీష చాలా లేట్‌గా వెళ్దాం అనుకున్నాము.

"గేమ్ 9కేనా?: అడిగాను.

"8 అనుకుంటా" అంది.

"పర్లేదులే. కొంచంసేపు తగ్గింది చూడాల్సిన బాధ. మంచిదే" ఇద్దరం నవ్వాము.

మమ్మల్ని చూసి ఎవరో "యూ డిడ్ నాట్ మిస్ ఎనీథింగ్. పాకిస్తాన్ వన్ ది టాస్. ఇండియా బ్యాటింగ్" అన్నాడు.

"అదేంటి? ఇంకా టాస్ మాత్రమే అయ్యిందా? మరి ఇంతమంది ఉన్నారు?" ఆశ్చర్యపోయాము.

ఆ గుంపులో తెలిసిన వాళ్ళని వెతికి అక్కడ కూర్చున్నాము. మొదటి రెండు బాల్స్‌లో మొదటి బాట్స్‌మెన్ ఔట్ అవ్వడంతో మేం అయ్యో అంటే మరికొందరు చప్పట్లు కొట్టారు. అక్కడ కేవలం ఇండియన్స్ కాక పాకిస్తాన్ వారు కూడా ఉన్నారని అప్పటిదాకా అర్థంకాలేదు.

"అందుకే గ్రీన్ వేసుకున్నారు పాక్‌వాళ్ళు" నిదానంగా మా చెవిలో చెప్పారు.

దాదాపు చాలా వరకు ఒకళ్ళ చప్పట్లు, మరొకరి ఏడుపులతో గేమ్ సాగింది. ఎవరో కోకోకోలా గ్లాస్‌లో నింపుకునేందుకు వెళ్ళినప్పుడు ఇండియా సిక్స్ కొట్టడంతో తిరిగి ఇండియా ఔట్ అయ్యేదాకా తనని రావద్దని మనవాళ్ళు అరిచారు. మరొకరు నుంచోగానే పాకిస్తాన్ ఫోర్ కొట్టడంతో "సిట్" అని ఇండియన్స్ "డోంట్ సిట్" అని పాకిస్తాన్ వాళ్ళు అరవసాగారు. ఆ తెల్లబ్బాయి పాపం ఏమీ అర్థంకాక వెళ్ళిపోయాడు. మేచ్ పూర్తయ్యాక చూస్తే ఒక్క తెల్లవాళ్ళు కూడా లేరు అక్కడ. లంచ్ టైములో ఎవరైనా వచ్చినా, ఏదో గొడవ జరుగుతుందనుకుని వెళ్ళిపోయి ఉంటారు. ఈ గోల ప్రతి ఇండియా పాకిస్తాన్ మేచ్ అప్పుడు మామూలే అని, ఇక్కడున్న ఇండియన్ ప్రొఫెసర్స్ డీన్‌తో మాట్లాడి ఇలా ఏర్పాటు చేసారని చెప్పారు. ఏ రోజూ లేనిది ఈ రోజే అందరికి దేశభక్తి కలిగింది

"ఒక్క పాకిస్తాన్ ప్రొఫెసర్ కూడా డీన్ దగ్గరకి వెళ్ళి ఇలా ఏర్పాటు చెయ్యమని అడగలేదు తెల్సా? మనవాళ్ళే అడిగారు" అని ఒకరు.

"అసలు పాకిస్తాన్ ప్రొఫెసర్ అంటే అహ్మద్ కాక ఇంకెవరున్నారు? అంతా మనవాళ్ళే" అని మరొకరు అన్నారు. ఆ వెనక్కి తిరిగి చూస్తే కొంతమంది ప్రొఫెసర్లు వాళ్ళ భార్యా పిల్లలతో వచ్చారు. ఎవరు బాగున్నారు, పిల్లలకి ఎవరి పోలిక వచ్చింది అని నేను, హనీష, గ్రీష్మ టైంపాస్ చేసాము. చివరికి ఇండియా గెలవగానే నేను పక్కకి తిరిగి "వీ వన్" అన్నాను.

"నో, వీ లాస్ట్" అన్నాడతను.

"అదేంటీ? మనం  ఓడిపోయామంటున్నాడు?" ముందరబ్బాయిని తట్టి అడిగాను.

"ఓడిపోతే లాస్ట్ అనే అంటారు కదా" వెటకారంగా అన్నాడు.

"మరి ఎందుకు సెలబ్రేట్ చేస్తున్నారు?" అడిగాను.

"గెలిస్తే ఇంతే కదా" అన్నాడు. ఈ అబ్బాయికి కాస్త తిక్కుందని మళ్ళీ నా పక్కన అబ్బాయివంక చూసాను. తను ఫోన్‌లో మెసేజ్ పంపుతున్నాడు.

"ఐ థింక్ వీ వన్. ఎవ్రీ వన్ ఈజ్ సెలబ్రేటింగ్" అన్నాను.

"యా. బట్ వీ లాస్ట్" అన్నాడు.

రెండు క్షణాల తరవాత అతను  పాకిస్తాన్ అబ్బాయని బుర్ర వెలిగి,   క్షమార్పణ కోరాను. గ్రీన్ డ్రస్  వేసుకోలేదు ఇతను. అతను నవ్వి ఫరవాలేదని వెళ్ళిపోయాడు.

"పాపం పాకిస్తాన్ వాళ్ళు మంచివాళ్ళే" అన్నాను.

"ఇంత చదువుకుని ఇక్కడి వరకు వస్తే ఆఫ్ఘనిస్తాన్ వారు కూడా అలానే ఉంటారు" అన్నాడు నా ముందరబ్బాయి నా మాటని విని.

ఇండియా గెలిచినందుకు అంతా చిన్న గ్రూపులుగా విడిపోయి ఎవరికి నచ్చిన విధంగా వారు సెలెబ్రేట్ చేసుకున్నారు. నేను, హనీష, మయూరి, గ్రీష్మ ఐస్‌క్రీమ్ తినడానికి వెళ్ళాము. మా ముగ్గురికి క్రికెట్ గురించి ఎక్కువ తెలియకపోవడం, పెద్దగా ఇష్టంలేకపోవడంతో మాకు జత కుదిరింది. హనీషకి నన్ను ఆ గ్రూప్‌లో ఆడ్ చేసి, గేమ్ చూడ్డానికి తీసుకువెళ్ళినందుకు థాంక్స్ అని చెప్పాను. పాకిస్తాన్ వారితో కూర్చుని ఇండియా – పాకిస్తాన్ క్రికెట్ గేమ్ చూడడం ఇదే మొదటిసారి. బహుశా ఇదే ఆఖరిసారి కూడా కాబోలు.

(కొనసాగింపు వచ్చే నెలలో)

Click here to share your comments on this story